అవాంతరాలు లేకుండా నిమజ్జన ఏర్పాట్లు



దుండిగల్: వినాయక నిమజ్జన వేడుకలు ఆరంభమైన నేపథ్యంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్ నాయక్ అన్నారు. గణేష్ నిమజ్జనంలో భాగంగా మున్సిపాలిటీ పరిధిలోని భౌరంపేట, మల్లంపేట, పోచంపల్లి, దుండిగల్, గాగిల్లాపూర్‌లోని చెరువులను శుక్రవారం పరిశీలించారు. నిమజ్జన సమయంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

ఘనంగా నేషనల్ స్పోర్ట్స్ డే



జీడిమెట్ల: ఒలంపిక్స్‌లో దేశానికి మూడుసార్లు బంగారు పథకాలు సాధించిన మేజర్ ధ్యాన్‌చంద్ చిరస్మరణీయుడని టీపీఆర్ మోడల్ హైస్కూల్ ప్రిన్సిపాల్ జయరాజ్ అన్నారు. శుక్రవారం నేషనల్ స్పోర్ట్స్‌డే పురస్కరించుకుని టీపీఆర్, సత్యవాణి పాఠశాలల విద్యార్థులు ఎస్.ఆర్‌నాయక్‌నగర్, అపురూపా కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో భాగంగా భారతదేశానికి కీర్తి ప్రతిష్టలు తీసుకువచ్చిన క్రీడాకారుల పేర్లు గుర్తు చేసుకున్నారు. అనంతరం విద్యార్థులు పాఠశాలకు చేరుకుని జ్యోతి వెలిగించి స్పోర్ట్స్ ఫ్లాగ్‌ను ఆవిష్కరించారు. అకాడమిక్ డైరెక్టర్ వంశీరెడ్డి, ఉపాధ్యాయులు లక్ష్మణాచారి, రాజేష్, రజని, విద్యార్థులు పాల్గొన్నారు.

డబుల్.. వసూల్!

- దూలపల్లిలో డబుల్ బెడ్ రూమ్ పేరుతో నయాదందా
- ఇప్పటికే కొంతమంది వద్ద వసూళ్లు
- అమాయకులే వారి టార్గెట్
- మితిమీరుతున్న ఆ నలుగురు..
- ప్రశ్నిస్తే బెదిరింపులు



డబుల్ బెడ్‌రూమ్ సముదాయం

సుభాష్‌నగర్: ఇళ్లు లేని పేద, మధ్య తరగతి ప్రజలకు అందిస్తున్న డబుల్ బెడ్ రూమ్‌లు, సొంత స్థలం ఉంటే ఇందిరమ్మ పథకం ద్వారా 5 లక్షల రూపాయల ఆర్థికసాయాన్ని ప్రభుత్వం అందజేస్తుంది. ఈ పథకాన్ని కొంతమంది ఆసరా చేసుకుని అమాయకుల వద్ద అందిన కాడికి దండుకుంటున్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లిలో కొన్ని రోజులుగా గుట్టుచప్పుడు కాకుండా ఈ చీకటి వ్యవహారం నడుస్తుంది. స్థానికంగా ఉన్న నలుగురు లీడర్లు పేద, మధ్య తరగతి ప్రజల వద్దకు వెళ్లి తమకు కలెక్టర్ ఆఫీసులో తెలుసు, సీఎం నుంచి నేరుగా మాకు వ్యవహారాలు నడుస్తాయని వారిని నమ్మబలుకుతున్నారు. ఇప్పటికి పదుల సంఖ్యలో అమాయకులను మోసం చేసి లక్షల రూపాయలను దండుకున్నట్లు తెలుస్తోంది. ఆ నలుగురి లీడర్ల అరాచకాలు మితిమీరి పోవడంతో వారి చేతిలో మోసపోయిన వారు ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారు. దీంతో బాధితులు కక్కలేక మింగలేక లోలోన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

రూ.2 లక్షల నుంచి 3 లక్షలవరకు..

ఇళ్లు లేని వారికి ప్రభుత్వం కట్టించే డబల్ బెడ్ రూమ్ కావాలంటే దళారులు రూ.2 లక్షల నుంచి 3 లక్షల వరకు ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. అందుకు అడ్వాన్సుగా 25 వేల నుంచి 50 వేల రూపాయల వరకు వసూలు చేస్తున్నారు. ఇక సొంత స్థలం ఉంటే రూ.5 లక్షలు మంజూరు చేయిస్తామని రూ. 25 వేల నుంచి 50 వేల వరకు తీసుకుంటున్నట్లు చర్చ జరుగుతుంది.

నిర్భయంగా ఫిర్యాదు చేయండి



డబుల్ బెడ్ రూమ్‌ల పేరిట అమాయకుల వద్ద డబ్బులు వసూలు చేస్తున్న వారిని ఉపేక్షించం. తమ సిబ్బందితో నిఘా ఏర్పాటు చేస్తాం. ఆ నలుగురు వద్ద మోసపోయిన వాళ్లు నిర్భయంగా తమకు ఫిర్యాదు చేయాలి. వారి పేర్లను గోప్యంగా ఉంచి దళారులపై కఠిన చర్యలు తీసుకుంటాం. దళారుల మాట నమ్మి అమాయకులు మోసపోవద్దు.

– విజయ వర్ధన్, పేట్ బీరాబాద్ సీఐ

నిమజ్జనం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: నిమజ్జనం రోజున నిబంధనలు పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో గణేష్ నిమజ్జనం నిర్వహించుకోవాలని కమిషనర్ సాబేర్ అలీ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, ప్రజలకు సూచించారు. శుక్రవారం నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ హాల్ నందు గణేష్ నిమజ్జనానికి సంబంధించిన విషయాలపై పోలీస్ అధికారులు, ఇరిగేషన్, ఎలక్ట్రిసిటీ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక నిమజ్జనానికి వచ్చే విగ్రహ మూర్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. ఇప్పటి వరకు నిమజ్జనం సాఫీగా జరగడానికి తీసుకున్న చర్యలపై కమిషనర్ ప్రశంసించారు. కార్యక్రమంలో పోలీస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఆర్వో రమేష్, ఇరిగేషన్ ఎలక్ట్రిసిటీ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి అసెంబ్లీ కన్వీనర్ గిరివర్ధన్ రెడ్డి, కోకన్వీనర్ ఆకుల సతీష్, నిజాంపేట్ భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి కన్వీనర్ రచ్చ చక్రధర్, ప్రగతినగర్ కన్వీనర్ అరుణ్‌రావు, డా.ఎంఆర్ఎస్ రాజు, దాసి నాగరాజు, బాబు చౌదరి, సత్యనారాయణ, అశోక్, వెంకట్రావు, ఈశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కుత్బుల్లాపూర్: 11కేవీ బాలాజీ ఫీడర్ లైన్ బ్యూరిఫికేషన్ పనుల నేపథ్యంలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తనుందని పేట్‌బషీరాబాద్ సబ్‌స్టేషన్ ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. 11కేవీ వైష్ణవి ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు గంగా ఎన్‌క్లేవ్, ఎన్‌సీఎల్ కాలనీల్లో సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలపై పడిన ప్లంబర్

పరిస్థితి విషమం



సుభాష్‌నగర్: నిర్మాణంలో ఉన్న భవనం వద్ద ప్లంబింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారీ విద్యుత్ తీగల పై పడ్డాడు. ఈ ఘటన సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బహదూర్‌పల్లిలో నివాసం ఉండే సల్మాన్ బి సాయబ్ (27) ప్లంబర్. సూరారం ప్రధాన రోడ్డు ఆనుకొని జి ప్లస్ త్రీ నిర్మాణం చేపడుతున్న ఓ భవనం వద్ద ప్లంబర్‌గా పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే శుక్రవారం మొదటి అంతస్తులో పని చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి భవనం పక్కనే ఉన్న విద్యుత్ ప్రధాన తీగలపై పడ్డాడు. దీంతో స్థానికులు వెంటనే అతడిని స్థానికంగా ఉన్న మల్లారెడ్డి ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆయన పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

బొజ్జ గణపయ్య.. పూజలందుకోవయ్య..

గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో శుక్రవారం ఆయా మండపాల వద్ద విశేష పూజలు నిర్వహించారు. సంక్షేమ సంఘాలు, మండప నిర్వాహకులు, యూత్ సభ్యులు గణనాథులను దర్శించుకుని పూజలు చేశారు. నియోజకవర్గ వ్యాప్తంగా గణేష్ మండపాల వద్ద పండుగ వాతావరణం నెలకొంది. ఆయా కాలనీల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

– కుత్బుల్లాపూర్



నిజాంపేట్‌లో నిర్వహించిన పూజలో పాల్గొన్న కొలన్ శ్రీనివాస్‌రెడ్డి



కైసర్‌నగర్ డబుల్‌బెడ్‌రూమ్ సముదాయంలో..కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి



పూజలో పాల్గొన్న రంగారెడ్డినగర్ గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు



నిజాంపేట్ కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పూజలో కమిషనర్ సాబేర్ అలీ



కుత్బుల్లాపూర్ గ్రామంలో జై భీమ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



ఎంపీ ఈటల రాజేందర్

దుండిగల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో నూతనంగా ఫుట్‌బాల్ గ్రౌండ్, అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్ బాల్, వాలీబాల్ కోర్టులను ముఖ్య అతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎంఎల్‌ఆర్‌ఐటీ కళాశాలలో ప్రపంచ స్థాయి క్రీడా మౌలిక సదుపాయాలను కల్పించడం అభినందనీయమన్నారు. ఐదు సంవత్సరాలుగా అరుంధతి ఆసుపత్రిలో అందిస్తున్న ఉచిత చికిత్స సేవలపై ప్రశంసలు కురిపించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, కళాశాల సెక్రటరీ, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, డైరెక్టర్ అనుశ్రేయా రెడ్డి, వైస్ చైర్మన్ దీరేన్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బాస్కెట్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రావుల శ్రీధర్‌రెడ్డి, కార్యదర్శి పాల్గుణ, కళాశాల ప్రిన్సిపాల్ కె శ్రీనివాస్ రావు తదితరులు పాల్గొన్నారు.